క్లుప్తంగా

విఘ్నేశ్వరుడికి సంకట హర పూజలు



అలంకరణలో విఘ్నేశ్వరుడు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో విఘ్నేశ్వరుడికి సంకటహర పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం రాత్రి స్వామి వారికి ఆలయ ఈఓ డివి రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు మల్లికార్జున స్వామి అభిషేకాలు, పూజలు నిర్వహించి స్వామి ఇష్టమైన గరికతో పాటు పూలతో అందంగా అలంకరించారు. ఈ పూజలలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలందుకున్న ఉత్సవమూర్తులు

చిన్నమండెం : మండల పరిధిలోని పలు గ్రామాల్లోని శ్రీ వేంకటేశ్వర స్వామి, రామాలయం, ఆంజనేయస్వామి ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కావడంతో స్వామి వారిని అందంగా అలంకరించి, ఆకు పూజలు, సింధూర పూజలు, అభిషేకాలు జరిపారు. ఆలయాల్లో భక్తుల రద్దీ కనిపించింది. వచ్చిన భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఆరోగ్య ఉపకేంద్రం తనిఖీ



మందులను తనిఖీ చేస్తున్న అధికారి

గాలివీడు : మండలకేంద్రం గాలివీడు–1 పరిధిలోని ఆరోగ్య ఉప కేంద్రాన్ని అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ సభ్యులు, జిల్లా స్టాటిస్టికల్ అధికారి ఓబుల్‌రెడ్డి, డీపీఓ మునీశ్వర్ శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య ఉపకేంద్రంలో అందిస్తున్న సేవలు, వాటిని ఏఎన్‌ఎంలు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. గర్భిణులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి, వారు తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి తెలియజేశారు. అనంతరం స్థానిక ఉర్దూ పాఠశాలలో 30 మంది బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

రైతులను ఆదుకోవాలి



మోటకట్ల సమీపంలో ఎండిన వేరుశనగ పంటను పరిశీలిస్తున్న రైతు నాయకుడు రంగారెడ్డి

సంబేపల్లె : ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం నాయకుడు రంగారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలో మోటకట్లలో ఆయన రైతులు సాగు చేసిన వేరుశనగ పంటను పరిశీలించారు. ఖరీఫ్ ప్రారంభంలో అరకొర వర్షాలు పడటంతో రైతుల వేరుశనగ సాగు చేశారన్నారు. దాదాపు మూడు నెలలు గడుస్తున్నా వర్షం పడలేదని సాగు చేసిన వేరుశనగ ఎండిపోతోందన్నారు. ఈ–క్రాప్ ద్వార పంటలను గుర్తించి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

కుక్కల దాడిలో జింకకు గాయాలు

పెద్దతిప్పసముద్రం : స్థానిక రంగ సముద్రం రోడ్డులో అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఓ జింకపై శునకాలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. అటుగా వెళుతున్న ప్రజలు కుక్కల బారి నుంచి జింకను కాపాడి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం అటవీ శాఖ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం చేరవేశారు.

ప్రపంచ అల్జీమర్స్ డే

వాల్మీకిపురం : ప్రపంచ అల్జీమర్స్ డే సందర్భంగా మండలంలోని మూరేవాండ్లపల్లిలో ప్రజలకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ ఈ మతిమరుపు వ్యాధి డెమెన్షియా అనే మానసిక వ్యాధిలో భాగమన్నారు.మంచి పౌష్టికాహారం, ఆకుకూరలు, కూరగాయలు, పాలు, గుడ్లు, నీరు, సరైన నిద్ర, సెల్ ఫోన్ వాడకం తగ్గించడంతో మతిమరుపునకు గురికాకుండా ఉండవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో పుష్ప, రెడ్డెమ్మ పాల్గొన్నారు.

గురజాడ భావితరాలకు అడుగుజాడ



సిద్దవటం: గురజాడ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు



ఒంటిమిట్ట: పెన్నపేరూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో..



పుల్లంపేట: గురజాడ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

సిద్దవటం : ఆర్థికాభివృద్ధి వైపు నడిపించి సమాజాన్ని నిజమైన ప్రజాస్వామ్యం వైపుగా మళ్లించేదే గురజాడ దృష్టిలో నిజమైన దేశభక్తి అని జనవిజ్ఞాన వేదిక కడప జిల్లా అధ్యక్షుడు సమీర్‌బాషా తెలిపారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకొని మండలంలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రార్థనా సమయంలో గురజాడ రాసిన 'దేశమును ప్రేమించుమన్నా' అనే దేశ భక్తి గేయాన్ని విద్యార్థులచే ఆలపింపజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయన చిత్రపటాన్ని పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు నాగమునిరెడ్డి మాట్లాడుతూ గురజాడ అప్పారావు తన రచనల ద్వారా సమాజంలోని సాంఘిక దురాచారాలను రూపుమాపడానికి విశేషంగా కృషి చేసిన గొప్ప హేతువాది అని అన్నారు. తెలుగు ఉపాధ్యాయుడు నరసింహులు మాట్లాడుతూ గురజాడ అప్పారావు రచించిన కన్యాశుల్కం నాటకం అత్యంత అద్భుతమని తెలుగు సాహిత్యంలో వాడుక భాష ఒరవడికి కృషి చేసినవారిలో గురుజాడ ముఖ్యుడని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్బరాయుడు, రవిశంకర్, పోతులూరయ్య, రమణయ్య, సుజాత, మాధవీలత, రాజమ్మ, పరమేశ్వరి, రాజేష్, హేమంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట(సిద్దవటం) : గురజాడ వెంకట అప్పారావు సమాజాభివృద్ధికి అడుగుజాడ అని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు పేర్కొన్నారు. ఒంటిమిట్ట మండలం పెన్నపేరూరు ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం గురజాడ జయంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాలెం మహేష్‌బాబు మాట్లాడుతూ సమాజంలోని సాంఘిక దురాచారాలను రూపు మాపడానికి ఆయన కృషి చేశారన్నారు. బాల్య వివాహాలు, సతీ సహగమనం, మొదలైన దురాచారాలను రూపుమాపడానికి శాయశక్తులా కృషి చేశారన్నారు. వితంతువులకు పునర్వివాహాలను ప్రోత్సహించి మహిళా చైతన్యానికి శ్రమించారన్నారు. ఆధునిక తెలుగు భాష వ్యాప్తి కొరకు గిడుగు రామ్మూర్తి పంతులతో కలిసి ఆనాటి ప్రాచీన భాష పండితులతో పోరాడారని తెలిపారు. గురజాడ రచనలు నేటి పరిస్థితులకు కూడా అన్వయించుకునే విధంగా ఉన్నాయని, ప్రతి ఒక్కరూ గురజాడ అడుగుజాడల్లో నడిచి సమాజ పురోభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షీలా కుమారి, ఉపాధ్యాయులు మహబూబ్‌ఖాన్, పెద్దరెడ్డెయ్య, హెలెన్ మంజుల, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేట : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శనివారం గురుజాడ అప్పారావు జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయన చేసిన సేవలను వివరించారు. ఆయన రచనలు సమాజంలోని వెనుకబాటుతనాన్ని తెలియజేసేవన్నారు. మూఢచారాలను వ్యతిరేకించి మహిళల తరపున పోరాటం చేసిన గురుజాడ నేటి తరానికి ఆదర్శప్రాయుడన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజయ్య వెంకటరెడ్డి. ఇంద్రావతి. చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

సిద్దవటం : టాటా బిల్డింగ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో శ్రీ సాయి హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. శనివారం శ్రీ సాయి హైస్కూల్‌లో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు బంగారు, వెండి పతకాలు సాధించినట్లు స్కూల్ కరస్పాండెంట్ పోలు వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పతకాలు గెలుపొందిన నిమ్మకాయల పూజిత, కరణం పాటురు హేమవర్షిని, సయ్యద్ ఇందాద్‌ఖాద్రి, నల్ల సహస్ర, చాటకుంట మానస, కాకర్ల చెన్నకేశవరెడ్డిలను అభినందించి, సర్టిఫికెట్లను అందించారు.

పేకాటరాయుళ్లు అరెస్ట్

సంబేపల్లె : మండల పరిధిలోని దుద్యాల గ్రామంలో పేకాటరాయుళ్లను ఎస్ఐ భక్తవత్సలం శనివారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని దుద్యాల గ్రామంలోని కోటకాడపల్లె సమీపంలో పేకాట ఆడుతున్నారన్నా ముందస్తు సమాచారంతో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి 6 మంది వ్యక్తులతోపాటు వారి వద్ద రూ.2500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు వారిపై కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపరుచనున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకోకపోతే మనుగడ కష్టం



రాయచోటి టౌన్: మాట్లాడుతున్న పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి శ్రీనివాసరావు

రాయచోటి టౌన్ : పర్యావరణాన్ని కాపాడుకోకపోతే మనిషి మనుగడ కష్టమని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, కడప ప్రాంతీయ కార్యాలయ ఇంజనీరు పి.శ్రీనివాసరావు అన్నారు. శనివారం రాయచోటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సెప్టెంబర్ 17వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా స్వభావం – పరిశుభ్రత, ఆచారాలు – పరిశుభ్రతలతో ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై కళాకారుల బృందంతో విద్యార్థులకు అర్థమయ్యేలా పాటలు, జానపద గీతాలు, ఇంద్రజాలం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో వ్యర్థాల నుంచి తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడం ఎలా వాటి నుంచి పర్యావరణాన్ని ఎలా కాపాడుకోవాలనే అంశాలపై వివరించి చెప్పారు. కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పుల్లంపేట: విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న బ్యాంక్ అధికారి

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పుల్లంపేట : ఏపీజీబీ(ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్) సహకారంతో శనివారం మండల పరిధిలోని కొత్తపేట జిల్లా పరిషత్ పాఠశాలలో బ్యాంకు డిప్యూటీ మేనేజర్ శశికళ, ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున ఆధ్వర్యంలో విద్యార్థులకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శశికళ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. విద్యార్థుల ఉన్నత చదువులకు బ్యాంకు రుణ సదుపాయంతో సహకరిస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది రాజయ్య, వెంకటరత్నం, సుకన్య, ఇందిరావతి, చంద్రశేఖర్ రెడ్డి, వెంకటరామిరెడ్డి, ప్రసాద్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ బాలశేఖర్, కిషోర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

ఒంటిమిట్ట(సిద్దవటం) : ఆకేపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ఆదివారం నిర్వహించనున్నట్లు రాష్ట్ర గిడ్డంగుల శాఖ మాజీ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కొత్తమాధవరంలో శనివారం ఆయన మాట్లాడుతూ ట్రస్ట్, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి ఆధ్వర్యంలో తిరుపతి శ్రీ వేంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఒంటిమిట్టలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిబిరం జరుగుతుందన్నారు. కంటికి సంబంధించిన అన్ని రకాల వ్యాధులకు చికిత్స అందిస్తారన్నారు. ఆపరేషన్‌లు అవసరమైతే ఉచితంగా చేయించి మందులు అందజేస్తామని పేర్కొన్నారు. శిబిరానికి వచ్చే వారు ఫోన్ నెంబర్, ఆధార్ కార్డు, రేషన్ కార్డును వెంట తీసుకురావాలన్నారు. ఉచిత కంటి వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గ్రామ సింహాలతో బెంబేలు



గాలివీడులో సంచరిస్తున్న శునకాలు

- తరుచూ ప్రజలపై దాడి చేస్తున్న వైనం
- పట్టించుకోని మండల అధికారులు

గాలివీడు : మండల కేంద్రంలో ఎటు చూసినా గ్రామ సింహాలు (శునకాలు) స్వైర విహారం చేస్తూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. గాలివీడు గేటు నాలుగు రోడ్ల కూడలి, హైస్కూల్ సర్కిల్, బస్టాండు వరకు ఎక్కడ చూసినా కుక్కలు గుంపులుగా తిరుగుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. చీకటి పడితే చాలు ద్విచక్రవాహనాలను వెంబడిస్తూ దాడికి పాల్పడుతున్నాయి. దీంతో వాటి నుండి రక్షించుకునే ప్రయత్నంలో వాహనాలు అదుపుతప్పి వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మరో వైపు స్కూల్ విద్యార్థులు, వృద్ధులు, మహిళలు రోడ్ల పైకి రావాలంటే వణికిపోతున్నారు. దీనికి తోడు ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన శునాకలను సైతం పట్టణంలో వదిలివెళ్లడంతో గ్రామసింహాల సంఖ్య మరింత పెరిగింది. మండల కేంద్రంలో దాదాపుగా 200 శునకాలు సంచరిస్తున్నట్లు అంచనా. ఏ వీధిలో చూసినా ఏ మార్గంలోకి వెళ్లినా గ్రామ సింహాలు దర్శనమిస్తున్నాయి. చిన్నారులను చూస్తే చాలు శునకాల సేన వెంటపడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇప్పటికే స్థానికులు పలుమార్లు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అధికారుల నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

నియోజకవర్గ స్థాయి పోటీలకు 24 మంది ఎంపిక



పరుగుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సిద్దవటం : మండలంలోని భాకరాపేట జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో జరిగిన ఎస్‌జీఎఫ్ పోటీల్లో ప్రతిభ కనపరిచిన వారిని 24 మందిని నియోజకవర్గం స్థాయి పోటీలకు ఎంపిక చేశామని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీకేశమ్మ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆమె మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా సిద్దవటం, బెటాలియన్, జెఎంజె, భాకరాపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థినీ, విద్యార్థులు అండర్–17, అండర్–14 విభాగంలోని బాల, బాలికలు షాట్‌పుట్, పరుగుల పోటీల్లో పాల్గొన్నారు. వీరిలో షాట్‌పుట్ అండర్–17 విభాగంలోని బాలురు 3, బాలికలు 3, పరుగుల పోటీలో బాలికలు 3, బాలురు 3 ఎంపికయ్యారన్నారు. అండర్–14 విభాగంలో షాట్‌పుట్‌లో బాలికలు 3, బాలురు 3, పరుగుల పోటీలో బాలికలు 3, బాలురు 3 ఎంపికయ్యారని తెలిపారు. వీరు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో నాలుగు హైస్కూల్‌ల ఫిజికల్ డైరెక్టర్‌లు, పీఈటీలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు కిట్ల పంపిణీ



కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ శ్రీనివాసులు రెడ్డి

పుల్లంపేట : పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో శనివారం పంచాయతీ పారిశుధ్య కార్మికులకు హెల్మెట్లు, గ్లౌజులు (చేతి తొడుగులు) పంపిణీ చేశారు. అనంతరం డ్వాక్రా మహిళలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. తదుపరి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఓ హబీబుల్లా, ఈఓపీఆర్‌డీ పెంచలయ్య, వెలుగు సీసీ వెంకటసుబ్బయ్య, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపల్ రమేష్

చిన్నమండెం : మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో శనివారం బాల్య వివాహాలపై అవగాహనా సదస్సు నిర్వహించినట్లు ప్రిన్సిపల్ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో వివాహం అనేది ఒక కొత్త తరానికి నాంది లాగా ఉండాలన్నారు. యువ సంతతి, ఆరోగ్యంగా మానసిక వికాసానికి, దేశ అభ్యున్నతికి దోహదం చేస్తుందన్నారు. చిన్న వయస్సులో వివాహం చేస్తే పరిణితి లేక మానసిక, ఆరోగ్య సమస్యలు తలెత్తి కుటుంబవ్యవస్థ చిన్నాభిన్నం అవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారిణి అశ్విని, ఎన్ఎస్ఎస్ పీఓలు నాగనవీన్, సుబ్బరాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లల పట్ల శ్రద్ధ చూపాలి



పిల్లలను ఇంటివద్దనే పర్యేవేక్షిస్తున్న అధికారి రమణమూర్తి

సిద్దవటం : మండలంలోని ఎస్.రాజంపేటలో శనివారం ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల ఇంటి వద్దనే విద్యా కార్యక్రమం – ఉపాధ్యాయుల పనితీరును సమ్మిళిత విద్య అసిస్టెంటు కో–ఆర్డినేటర్ రమణమూర్తి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శనివారం ఇంటివద్దనే విద్యలో భాగంగా ఎస్.రాజంపేటలో పర్యవేక్షణ చేశామని ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ప్రతి బుధవారం భవిత సెంటర్‌లో జరిగే ఫిజియోథెరఫీ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలానే ప్రభుత్వం వీరికి ఎస్కార్టు ట్రాన్స్‌పోర్టు అలవెన్స్‌లను ఉపకరణాలకు అందిస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు పద్మావతి పాల్గొన్నారు.

ఆలయానికి బీరువా, హుండీ వితరణ



ఆలయానికి హుండీ, బీరువా వితరణ చేస్తున్న భక్తులు

గాలివీడు : మండల కేంద్రంలోని పెద్దూరు బ్రాహ్మణవీధిలో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి కేడెం వీరారెడ్డి, మంత్రి రెడ్డికళ తల్లిదండ్రులు దివంగత వెంకటలక్ష్మి, ఆదినారాయణ జ్ఞాపకార్థం బీరువాను వితరణగా శనివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అదే విధంగా కమిటీ సభ్యుల సహకారంతో హుండీని ఆలయంలో ఏర్పాటు చేశారు. అనంతరం ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం మరుగుదొడ్ల నిర్మాణానికి ఆర్థికంగా సహకారం అందించేందుకు దాతలు ముందుకు రావాలని కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు.

కార్యకర్తకు ఆకేపాటి ఘన నివాళి



అన్నారెడ్డి మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఆకేపాటి

పుల్లంపేట : మండల పరిధిలోని అనంతయ్యగారిపల్లికి చెందిన అన్నారెడ్డి (60) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడు అన్నారెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎనలేని కృషి చేశారు. ఆయన కుటుంబాన్ని రాజంపేట శాసనసభ్యులు, వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమర్నాథరెడ్డి మృతదేహానికి ఘనంగా నివాళులర్పించారు. తదుపరి మృతుని కుటుంబాన్ని పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రాజారెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రాజుకుంట యువత చేయూత



విద్యాసామగ్రి అందిస్తున్న రాజుకుంట గ్రామస్తులు

చిట్వేలి : విజయవాడ వరద బాధితులకు రాజుకుంటకు చెందిన యువత రూ. 65 వేలు విద్యాసామగ్రిని అందజేశారు. శనివారం విజయవాడలో ముంపునకు గురైన వాంబే కాలనీలోని జెడ్‌డీఎంసీ ప్రాథమిక పాఠశాలలో 450 మంది పిల్లలకు రూ. 65 వేలు విలువచేసే 3300 నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. అదే ప్రాంగణంలో ఉన్న అంగన్‌వాడీకి రూ. 5 వేలు విలుగ చేసే వస్తువులను అందించారు. అనంతరం నిర్మల శిశు భవన్ దివ్యాంగులకు రూ. 5 వేలును అందించారు. దాతృత్వం చాటిన రాజుకుంట యువతకు పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు అభినందించారు. కార్యక్రమంలో విజయవాడ మండల విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు, రాజుకుంట యువకులు నానబాల సురేంద్ర, పవన్, సాయికిరణ్, దిలీప్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీ కొన్న ద్విచక్రవాహనం

గాలివీడు : మండల పరిధిలోని గొట్టివీడు గ్రామం రాయచోటి – గాలివీడు మలుపు వద్ద కారును ద్విచక్ర వాహనదారుడు ఢీకొన్న సంఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు రాయచోటి నుండి గాలివీడుకు వస్తున్న కారును గాలివీడు నుండి రాయచోటికి వెళుతున్న వైఎస్సార్ వెలిగల్లు కాలనీకి చెందిన ఎస్ఎమ్ ఆదిల్‌బాషా ఢీకొనడంతో ఎడమ కాలుకు తీవ్ర గాయమైంది. స్థానికులు వెంటనే 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ రామకృష్ణ సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రజా దర్బార్‌కు సమస్యల వెల్లువ



నాయకులకు సమస్యలు తెలుపుతున్న ప్రజలు

ఓబులవారిపల్లె : ముక్కావారిపల్లె టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో సమస్యలు వెల్లువలా వచ్చాయి. ఇందులో ప్రధానంగా భూముల సర్వే, రేషన్ కార్డులు, పింఛన్లు తదితర అంశాలపై ప్రజలు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, అధికారులకు వినతులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన సమస్యలు క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కారం చేసేందుకు అధికారులతో కలిసి కృషి చేస్తామన్నారు. టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పీర్ మున్నీ, ఎంపీడీఓ విజయారావు, అన్నిశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏచూరి మరణం సబ్బండ వర్గాలకు తీరనిలోటు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

రాయచోటి అర్బన్ : ప్రజల పక్షాన పోరాటలు చేసి వారి సమస్యలు పరిష్కరించడంలో దివంగత సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పాత్ర ఎంతో కీలకమని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎన్‌జీఓ సభా భవనంలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ఏచూరి సంతాప సభకు ఆయన హాజరై మాట్లాడారు. సీతారాం ఏచూరి తనకున్న పట్టుదల, కార్యదక్షతతో గొప్ప మేధావిగా పేరొందారన్నారు. విద్యార్థి దశ నుంచే కమ్యూనిస్టు భావాలు ఉన్న ఏచూరి చివరి వరకు ప్రజల పక్షాన పోరాడటం స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన మరణం సబ్బండ వర్గాలకు తీరనిలోటన్నారు. పార్లమెంట్‌లో అంశాల పరంగా ప్రభుత్వాల నిరంకుశత్వాన్ని ప్రశ్నిస్తూ, నిర్మాణత్మకంగా ప్రసంగం ఉండేలా చూసుకునే వారన్నార. కార్యక్రమంలో పి.శ్రీనివాసులు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామాంజులు, నాయకులు పాల్గొన్నారు.

కెఎంపీఎల్ పెంచాలి

మదనపల్లె సిటీ : డ్రైవర్లు కెఎంపీఎల్ పెంచాలని ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. స్థానిక డిపో కార్యాలయంలో డ్రైవర్లకు శనివారం శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు వాహనాలు నడిపేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకుని, డిపోకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సీఐ గీత, సిబ్బంది పాల్గొన్నారు.

వేరుశనగ రైతులను ఆదుకోవాలి

ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఎంపీపీ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు

పెద్దమండ్యం : వేరుశనగ పంట సాగుచేసిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక కోరారు. మండలంలోని సి.గొల్లపల్లె పంచాయతీ మట్లివారిపల్లె వద్ద రైతులు సాగు చేసిన వేరుశనగ పంటను సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులతో కలిసి ఆమె పరిశీలించారు. తీవ్ర వర్షాభావంతో వేరుశనగ ఎండిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో ఎకరం భూమిలో విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చులు కలిపి రూ.20 వేలు వెచ్చించినట్లు రైతులు ఎంపీపీ దృష్టికి తెచ్చారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ఈ క్రాప్, ఈకేవైసీ చేసిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని ఎంపీపీ, సర్పంచులు, ఎంపీటీసీలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గుర్రం రమేష్, సర్పంచులు సోదనపల్లె బాషా, కంటి విశ్వనాథరెడ్డి, ఎంపీటీసీ మంచూరి జయరాం, వైఎస్సార్‌సీపీ నాయకులు గుర్రం రామచంద్ర, కోసూరి రాజు, షబ్బీర్ పాల్గొన్నారు.